మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 పేజీలు 8

## మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

# బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### - జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్,మేజర్ న్యూస్:** నేటి నుండి మార్చి 16 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై గురువారం మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు .అనంతరం దేవాలయం వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత సమావేశంలో బ్రహ్మోత్సవాలకు ఆయా శాఖలు ద్వారా చేసిన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు భాగంగా ముఖ్యమైన రోజులైన ఫిబ్రవరి 12 న స్వామి వారి గరుడ వాహన సేవ, రథోత్సవం అలాగే ఫిబ్రవరి 26 మహా శివరాత్రి,మార్చి 14 న శ్రీ అమ్మ వారి తిరు కళ్యాణోత్సవం, రాత్రికి గరుడ వాహన సేవ,విమాన రథోత్సవం ముఖ్యమైన రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ తగినన్ని బస్సులు నడపాలని అన్నారు. బ్రహ్మోత్సవాలు ముఖ్యమైన రోజులు ఫిబ్రవరి 12 రాత్రి,13న స్వామి వారి గరుడ వాహన సేవ,రథోత్సవం సందర్భంగా కొండ పైకి ఫిట్నెస్ ఉన్న మినీ బస్సులు నిరంతరంగా నడపాలని అర్.టి.సి అధికారులకు సూచించారు., వైద్య ఆరోగ్యశాఖ తరపున కొండపైన, కొండ దిగువన అలివేలు మంగతాయారు దేవాలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపు, డాక్టర్లు, మందులు ఏర్పాటు చేయాలని, ట్రాన్స్కో ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ ద్వారా కొండపైన, దిగువన అవసరమైన అగ్నిమాపక సాధనాలతో సిద్ధంగా ఉండాలని, 5 కిలోమీటర్ల పరిధిలో మద్యపానాన్ని నిషేధించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి ద్వారా అవసరమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ భక్తులకు అవసరమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, .శానిటేషన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పారిశుధ్య సమస్య తలచకుండా చూడాలని డిపిఓ ను ఆదేశించారు .దేవాలయం వద్ద ఏర్పాటు చేసే దుకాణాలలో అమ్మే తిను బండారాలు,ఆహార పదార్థాలు ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ నిర్వహించాలని సూచించారు.ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సిబ్బంది ఏర్పాటు చేసి మానిటర్ చేయాలని ఆదేశించారు.కోనేరు వద్ద బట్టలు మార్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాలయ కార్యనిర్వహణ అధికారికి సూచించారు.కోనేరు లో ఎప్పటి కప్పుడు నీటిని శుభ్రం చేయాలని,ప్రతి రోజూ నీటి సరఫరా చేయాలని అన్నారు.కొండ పైన ,క్రింద పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వేస్తున్నట్లు తెలిపారు. తప్పి పోయిన పిల్లలు ఉంటే ప్రకటించే లా ఏర్పాటు చేయాలని అన్నారు.ప్రస్తుతం ఉన్న 50 టాయిలెట్ లకు గాను పార్కింగ్ ఇతర ప్రదేశాలలో మొబైల్ టాయిలెట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు.టాయిలెట్ లు,పార్కింగ్,త్రాగు నీరు ప్రాంతాలు తెలిపేలా సైనేజి బోర్డు లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశం అనంతరం కొండ పైన అతిథి గృహాలు,పార్కింగ్,కోనేరు, పరిశీలించి సూచనలు చేశారు.కొండ పైకి వెళ్లే భక్తులకు ఇబ్బంది

మిగతా 2లో

# సమగ్ర వైద్య సేవలపై దృష్టి

### - జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ, ఆసుపత్రి విభాగాల పరిశీలన



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కోడేరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాస్పిటల్లోఉన్న వైద్యులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోజు ఎంత మంది పేషెంట్లు ఆస్పత్రికి వస్తుంటారని ఏ రకమైన వైద్య సేవలు అందిస్తున్నారని, ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ ఎన్ని నమోదు అవుతున్నాయని, నార్మల్ డెలివరీ కి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ పిహెచ్‌సిలోని ఇన్ పేషంట్ వార్డ్, ల్యాబ్, టీకాలు ఇచ్చే గది, ఔషధాలను నిల్వ ఉంచిన డ్రగ్ స్టోర్ తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, అందుబాటులో లేని వారి వివరాలను ఆరా తీశారు. వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో మాట్లాడి, అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న వైద్య పరికరాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కోడేరు మండల తహసిల్దార్ విజయ్ కుమార్ ఎంపీడీవో శ్రా, ఆర్ ఐ జంబులయ్య ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ఆరోగ్య అధికారులుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన వరి ధాన్యం పక్కదారి పట్టించే

# మిల్లర్ల పై ఉక్కుపాదం మోపాలి

### - యాసంగిలో వచ్చే వరి ధాన్యాన్ని సజావుగా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
### - అధికారులు ఎవరైనా మిలర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
### - వీడియో కాన్ఫిరేన్స్ లోరాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్




**వనపర్తి ప్రతినిధి మేజర్‌న్యూస్:** ఐడిఓసి కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం యాసంగి పంటల దిగుబడి అంచనా, కొనుగోలు, సి.యం.ఆర్ ధాన్యం పై సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహన్ అదనపు కలెక్టర్లు రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. యాసంగి సీజన్ లో సైతం వరి సాగు భారీగా జరుగుతుందని, ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే సజావుగా పూర్తి చేయవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన టార్పలిన్‌లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలను సురక్షితంగా తిరిగి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హార్వెస్టర్లను ముందుగానే పిలిపించి ఒక సమావేశం నిర్వహించాలని, వరి కోతలు చేసేటప్పుడు 18-20 ఆర్.పి యం తో కోతలు చేయాలని, తద్వారా తాలు, చెత్త లేకుండా నాణ్యమైన గింజలు పొందవచ్చన్నారు. డీజిల్ మిగిలించుకోడానికి తక్కువ ఆర్.పి యం.తో యంత్రాలు నడిపి రైతులకు తాలు, చెత్తతో ఇబ్బంది పడే విధంగా చేస్తుంటారన్నారు. అదేవిధంగా అధికారులు తరుచుగా మిల్లులను తనిఖీ చేయాలని, ఖరీఫ్ లో ఇచ్చిన ధాన్యం నిల్వలు తక్కువ ఉంటే మాత్రం మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలని, అలా జరగని పక్షంలో అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యాన్ని పక్కదారి పట్టించే మిల్లర్ల పై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో యాసంగి సీజన్ లో 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, దాదాపు 3.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావడానికి అవకాశం ఉందన్నారు. వచ్చిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సి.యం.ఆర్ ధాన్యం ఇవ్వని డిఫాల్ట్ మిల్లుల పై ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని, మిల్లర్లకు సహకరించిన సిబ్బంది పై సైతం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. తరచుగా మిల్లులను తనిఖీ చేసి వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేస్తున్నామని వివరించారు.జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, డి.యం జగన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో

# గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి

### - పాఠశాలలోని ఓ మహిళ ఉపాధ్యాయురాలి వేదింపులే కారణం...?
### - విద్యార్థిని తల్లిదండ్రుల ఆరోపణలు...!
### - మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి
### - విద్యార్థి సంఘాల నాయకులు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్
### - సీఐ నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు



**బాలానగర్, మేజర్‌న్యూస్:** బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం చొక్కనపల్లి గ్రామానికి చెందిన కొమ్ము రమేష్ రజిత దంపతుల కుమార్తె ఆరాధ్య పదవ తరగతి చదువుతుంది గురువారం ఉదయం బాలికల గురుకుల పాఠశాలలో ఆరాధ్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన? విషయాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన షాద్నగర్‌లోని కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు చెప్పడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల దగ్గరకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతు పాఠశాలలోని ఓ మహిళా ఉపాధ్యాయురాలి వేధింపుల వల్లే తమకూతురు మృతి చెందిందని తమకూతురుపై పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అలాంటి ఉపాధ్యాయులు పైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మృతి చెందిన ఆరాధ్య విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మరియు ప్రజా సంఘాల నాయకులు పాఠశాల దగ్గరకు చేరుకొని ఆరాధ్య మృతి చెందిన సంఘటన పై ఆరా తిశారు అనంతరం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ విద్యార్థినీ ఆరాధ్య మృతి చెందిన ఘటన పై సమగ్ర విచారణ జరిపి,విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసి

మిగతా 2లో

సూర్య
www.suryaa.com
శుక్రవారం
7 ఫిబ్రవరి 2025

## బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)



లేకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలను సవ్యంగా నిర్వహించేందుకు శాంతిభద్రత కమిటీ, ఫెస్టివల్ కమిటీ, వాటర్ ,శానిటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ , వంటి కమిటీలను ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు జిల్లా అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి

(మొదటిపేజీ తరువాయి)



విద్యార్థిని మృతికి కారణమైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని లేనీ పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్ మరియు పట్టణ సిఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## రైతు దీక్షను విజయవంతం చేయాలి

### - మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** ఈనెల 13న ఉదయం 11గంటలకు ఆమనగల్ పట్టణంలో నిర్వహించ తలపెట్టిన రైతు దీక్షను విజయవంతం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ రైతు దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా ఏర్పాటు చేయనున్న రైతు దీక్షకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు, ఈ సమావేశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు ఉన్నారు.

## నేడు వాహనాల వేలం : ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** వివిధ నేరాలలో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో నేడు వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీలర్, టూ విల్లర్, త్రీ వీలర్ వాహనాలు వేలం వేస్తున్నట్లు ఆసక్తి గలవారు నిర్ణీత రుసుము డిపాజిట్‌గా చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సీఐ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు, ఉదయం 10 గంటల 30 నిమిషాలకు వేలం పాట జరుగుతుందన్నారు.

# మహిళలు, అమ్మాయిలకు అండగా భరోసా కేంద్రం

### - లైంగిక వేధింపులపై 1098.100 టోల్ ఫ్రీ నెంబర్ల ద్వారా పోలీసు.. ఇతర జిల్లా అధికారుల సేవలు పొందవచ్చు





**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** సమాజంలో వేధింపులకు గురైన అమ్మాయిలు, మహిళలు న్యాయం కొరకు ఎక్కడికి వెళ్ళాలి ఎవరిని సంప్రదించాలి అనే సందిగ్ధం లేకుండా భరోసా కేంద్రం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా గురువారం ఉదయం పట్టణంలోని ఆర్టీసీ కాలనిలో ఉన్న భరోసా కేంద్రంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి భరోసా కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో ఉన్న అమ్మాయిలు కావచ్చు మహిళలు కావచ్చు సమాజంలో లైంగిక వేదింపులు లేదా బాల్య వివాహాలు, గృహ హింసకు గురి అయితే భరోసా 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్, 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్యాయానికి గురైన వారి వివరాలు గోప్యంగా ఉంచుతూ సత్వర న్యాయం, ఆర్థిక, విద్యా సహకారాలు అందించేందుకు భరోసా కేంద్రం పనిచేస్తుందన్నారు. భరోసా కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలు ఉంటారని, పోలీస్ శాఖ, న్యాయ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు న్యాయం చేకూర్చడం జరుగుతుందన్నారు. భరోసా ఏర్పాటు చేసిన తర్వాత 43 కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయడం జరిగిందన్నారు. 2024 సంవత్సరంలో జిల్లాలో 11 బాల్య వివాహాల కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహం చేయడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యక్షంగా లేక పరోక్షంగా బాల్య వివాహంలో భాగస్వాములైన వారిని సైతం ఉపేక్షించబోమని చెప్పారు. సంవత్సర కాలంలో అమ్మాయిలు, మహిళలకు అండగా ఉండి మంచి భరోసా కల్పించినందుకు భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ బాధిత అమ్మాయిలకు, మహిళలకు వైద్య పరంగా, న్యాయ సేవా పరంగా, విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి కొంత ఆర్థిక సహాయం చేస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని కొనియాడారు.సంవత్సర కాలములో మంచి ఫలితాలు సాధించినందుకు సిబ్బందిని అభినందించారు. బాధిత అమ్మాయిలు, మహిళలకు అండగా ఉంటూ వారిలో నమ్మకాన్ని కల్పించి తిరిగి తన దైనందిన జీవన శైలిలో జీవించే విధంగా భరోసా కేంద్రం పనిచేస్తుందన్నారు. అంతే కాకుండా భరోసా కేంద్రం సిబ్బంది విద్యాలయాలకు వెళ్లి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల పై అమ్మాయిలకు అవగాహన కల్పించడం, బాధితులు మానసిక క్షోభకు గురి కాకుండా ధైర్యంగా ముందుకు వచ్చి కేసులు పెట్టే విధంగా వారికి ధైర్యాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. మంచి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి అయిదు మంది బాధితులకు 36 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డిఎస్పీ వేంకటేశ్వర రావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, భరోసా కోఆర్డినేటర్ శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతులకు 30 కోట్లు మంజూరు




**మక్తల్ మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా డాక్టర్ వాకిటి శ్రీహరి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే తాజాగా మక్తల్ నియోజకవర్గంలో నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతుల కోసం 30 కోట్ల 73 లక్షల నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ... మక్తల్ నియోజకవర్గంలో తాజాగా నూతన బీటీ రోడ్ల కోసం 15 కోట్లు, ఇతర చోట్ల రోడ్ల మరమ్మతుల కోసం 15 కోట్ల 73 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. మాగనూరు మండల పరిధిలో మాగనూరు నుంచి అచ్చంపేట్ వరకు 4 కిలో మీటర్ల బీటీ రోడ్ నిర్మాణానికి 3 కోట్ల 80 లక్షలు, క్రిష్ణ మండల పరిధిలో క్రిష్ణ ఘాట్ నుంచి గుర్జాల్ గ్రామానికి 2 కిలో మీటర్ల బీటీ రోడ్ నిర్మాణానికి 2 కోట్ల 40 లక్షలు, ఉట్కూర్ మండల పరిధిలో బిజ్వార్ నుంచి కొత్తపల్లి మీదుగా ధన్వాడకు 2 కిలో మీటర్ల బీటీ రోడ్ నిర్మాణానికి కోటి 90 లక్షలు, నర్వ మండల పరిధిలో నర్వ నుంచి జక్కన్న పల్లి గ్రామానికి 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 90 లక్షలు, అమరచింత మండల పరిధిలో చంద్రఘడ్ స్టేజి నుంచి నందిమల్ల వరకు 1.85 కిలోమీటర్ల నిర్మాణానికి కోటి 40 లక్షలు, జెడ్పి రోడ్డు నుంచి ధర్మాపూర్ వరకు 2.52 కిలోమీటర్ల బీటీ రోడ్ నిర్మాణానికి 2 కోట్లు, ఆత్మకూరు మండల పరిధిలో వీర రాఘవపూర్ నుంచి పాముపురం వరకు 0.70 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి 60 లక్షల రూపాయలు మంజూరయ్యాయని అన్నారు. మొత్తం నియోజవర్గ పరిధిలో 16.07 కిలోమీటర్ల బీటీ రోడ్ నిర్మాణానికి 15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇక రోడ్ల మరమ్మత్తుల విషయానికొస్తే.. మక్తల్ మండల పరిధిలోని కాచ్ వార్ నుంచి ఎడివెల్లి గ్రామం వరకు 3.60 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు 2 కోట్ల 34 లక్షలు, ముష్టిపల్లి నుంచి అనుగొండ గ్రామం వరకు ఒక కిలోమీటర్ రోడ్ మరమ్మత్తు కోసం 65 లక్షలు, నర్వ మండల పరిధిలో పిడబ్ల్యుడి రోడ్డు నుంచి లంకాల మీదుగా నర్వ వరకు 7 కిలోమీటర్ల రోడ్ల మరమ్మత్తు కోసం 4 కోట్ల 55 లక్షలు, మాగనూరు మండల పరిధిలో కొల్పూరు గ్రామం నుంచి ముడుమాల్ గ్రామం వరకు 4 కిలోమీటర్ల రోడ్డు మరమ్మత్తు కోసం 2 కోట్ల 60 లక్షలు, అమరచింత మండల పరిధిలో నందిమల్ల నుంచి మిట్ట నందిమల్ల గ్రామం వరకు 6.80 కిలోమీటర్ల రోడ్డు మనమ్మత్తు కోసం 4 కోట్ల 42 లక్షలు, ఆత్మకూరు మండల పరిధిలోని పిడబ్ల్యుడి రోడ్డు నుంచి మేడిపల్లి వరకు 1.80 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతు కోసం కోటి 17 లక్షలు మంజూరయ్యాయని... మొత్తంగా నియోజవర్గ పరిధిలో 24.20 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతుల కోసం 15 కోట్ల 73 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. మొత్తం మీద మక్తల్ నియోజవర్గ వ్యాప్తంగా దాదాపుగా అన్ని మండలాల్లో నూతన బీటీ రోడ్లు, రోడ్ల మరమ్మతుల కోసం 30 కోట్ల 73 లక్షల రూపాయలను ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి మంజూరు చేయించారని, కేవలం ఏడాదిలోనే నియోజవర్గంలో రహదారుల కోసం దాదాపు 100 కోట్ల వరకు నిధులను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరికి దక్కుతుందని అన్నారు. గతంలో రహదారుల కోసం ఇంత పెద్ద ఎత్తున నిధులు ఎప్పుడు మంజూరు కాలేదని స్పష్టం చేశారు. నియోజవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలన్నదే ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ధ్యేయమని, పదవి కాలం పూర్తయ్యేలోపు ప్రతి గ్రామానికి బిటి రోడ్డు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అది నెరవేర్చేదిశగా డాక్టర్ వాకిటి శ్రీహరి చేపడుతున్న కృషి అభినందనీయమని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, మండలాధ్యక్షుడు గణేష్ , టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్, మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్, శాలం, సీనియర్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, నేతలు నూరుద్దీన్ , శంషుద్దీన్, అస్మొద్దీన్, బోయ నరసింహ, బండారి బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధ్యాయులకు శిక్షణ : మండల విద్యాధికారి పి. మురళీకృష్ణ

**చిన్నచింతకుంట, మేజర్ న్యూస్ :** మండలంలోని మండల ప్రాథమిక ,ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 లో నియామకమైన నూతన ఉపాధ్యాయులకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల వనరుల భవనంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎఫ్ ఎల్ ఎన్ పై సమగ్ర శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఉపాధ్యాయులు తప్పక శిక్షణలో పాల్గొనాలని ఆయన కోరారు.

## రైతులు తమ పంటను ఆరబెట్టుకొని మార్కెట్ యార్డ్‌కు తేవాలి

### - మార్కెట్ సెక్రటరీ శివరాజ్





**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** రైతులు తమ పంటను ఆరబెట్టుకొని మార్కెట్ యార్డ్ కు తేవాలని మార్కెట్ సెక్రటరీ శివరాజ్ తెలిపారు. గురువారం మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన వేరుశనగను పరిశీలించారు, తాలు, తేమశాతం ఎక్కువగా ఉన్న వేరుశనగ వల్ల రైతులకు సరైన ధర రాదని రైతులు నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు, తమ పంటను నాణ్యతగా మార్కెట్ యార్డుకు తేవాలని, అప్పుడే గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు, వేరుశనగ గరిష్ట ధర 6330, మోడల్ ధర, 6232, కనిష్ట ధర 4801 ధర పలికింది, అదేవిధంగా కందులు కనిష్ట, గనిష్ట, మోడల్ ధర 6410 ధర పలికింది, 209 మంది రైతులు 2476 క్వింటాల వేరుశనగ, నాలుగు క్వింటాల కందులు మార్కెట్ యార్డుకు తేవడం జరిగిందని మార్కెట్ సెక్రటరీ శివరాజ్ తెలిపారు, రైతులకు మధ్యాహ్న భోజనం, తాగునీటి సదుపాయం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

## బైపాస్ రోడ్డు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### - సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు



**చారకొండ, మేజర్‌న్యూస్:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చారకొండ మండల కేంద్రం నుండి మర్రిపల్లి వరకు చేపట్టిన బైపాస్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు చారకొండ బైపాస్ రోడ్డులో చాలామంది నిరుపేదలవే ఇల్లు నేలమట్టం చేశారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు ఇంటి స్థలం ఇచ్చి అందులో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలా బాధితులకు సిపిఐ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## బేటి బచావో బేటి పడావో పథకం దశాబ్ది ఉత్సవాలు



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ బచావో బేటి పడావో పథకం ప్రవేశపెట్టి పది సంవత్సరాలు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుంది మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ భేటీ బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలను దాన్వాడ మండల కేంద్రములోని మాడల్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మొక్కలు నటించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయి సమస్త ప్రాణరాశి బ్రతకడం కోసం అవసరమైనటువంటి ఆక్సిజన్ ను అందించడం ఈ యొక్క చెట్ల ద్వారానే అది సాధ్యమవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు బాధ్యతగా ఒక మొక్కను నాటాలని ఈ సందర్భంగా తెలియజేశారు. జిల్లా మహిళా సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టులు అనిత, నర్సిములు, ఆర్థిక నిపుణులు విజయకుమార్ మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో పథకం యొక్క ఉద్దేశాలు మాట్లాడుతూ సమాజంలో లింగ అసమానత లను రూపుమాపడానికోసం, బాలికల కోసం బాల్యవివాహాల నిర్మూలన కోసం మరియు బడిబాటి పిల్లలు బడిలో చేర్పించడం కోసం బాలికలు జీవితంలో అత్యున్నత శిఖరాలను అందుకోవడం కోసం ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని తెలియజేశారు అనంతరం జిల్లా మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్టు అనిత, నరసింహులు, ఆర్థిక నిపుణులు విజయ్ కుమార్ మాడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చారకొండలో జాతీయ రహదారి బైపాస్ బాధితులకు కొత్తగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### - 10న బాధితులతో జిల్లా కలెక్టర్ ముట్టడి నిర్వహిస్తాం - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



**చారకొండ, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో జాతీయ రహదారి 167 రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇండ్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా 29 ఇండ్లను జెసిబి లతో నేలమట్టం చేయడంతో పేదలంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని , బాధితులకు వెంటనే నూతన ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం చారకొండ మండల కేంద్రంలో బైపాస్ బాధితులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో బాధితులతో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ జాతీయ రహదారి బైపాస్ బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపియకుండా హఠాత్తుగా వచ్చి అధికారులు, పోలీసు భారీగా మోహరించి వారి ఇండ్లను నేలమట్టం చేశారని అన్నారు. కనీసం తమ ఇంట్లో ఉన్న సామాన్లను తీసుకోవడానికి సమయం ఇవ్వండి అని అడిగినా ఇవ్వకుండా దౌర్జన్యంగా నిర్ధాక్షణంగా కూల్చివేశారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం బాధితులకు ఏమాత్రం సరిపోదని వారికి ఇచ్చిన పరిహారం కనీసం 100 గజాల జాగా కూడా రాని దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం బాధితులకు ఇంటి స్థలం తో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులకు 50 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన శుక్రవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట బైపాస్ బాధితులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు . పేదలకు న్యాయం జరగకపోతే ఈనెల 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు . అనంతరం తాసిల్దార్ సునీతకు బాధితుల పక్షాన వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, సిపిఎం ఏరియా కార్యదర్శి బి బాలస్వామి, సిపిఎం నేత మధు, బాధితులు కిరణ్, అనిల్ సందూరి నరేష్, గ్యార రాజు, అలివేలు శిరీష, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు



**నాగర్ కర్నూల్,మేజర్ న్యూస్:** రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూలు ఇంటర్నేషనల్ క్యాన్సర్ డే ఫిబ్రవరి 3 తేదీలో బాగంగా గురువారం రోజున నాగర్ కర్నూలు పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సునిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి జి సబిత, సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హాజరై మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి ముఖ్యంగా మహిళలు గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు విరివిగా చేయించుకోవాలి క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తించినట్లు అయితే త్వరగా నయం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. మూడు, నాలుగు దశలలో గుర్తించినట్లు అయితే ఇబ్బందికరంగా ఉంటుంది. క్యాన్సర్ కు సంబంధించిన ప్రథమ చికిత్స నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేయబడును. క్యాన్సర్ పై ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి గ్రామాల్లో పట్టణాల్లో సభలు నిర్వహించి ఎవరికైనా ప్రజల్లో ఏదైనా అనుమానం వచ్చినచో నాగర్ కర్నూలు గవర్నమెంట్ ఆసుపత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. ఇట్టి అవకాశానీ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. గత సంవత్సరం 20,538 స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తే అందులో 474 పాజిటివ్ గా వచ్చాయి. ఇట్టి కార్యక్రమం లో ఇంచార్జీ సూపరిండెంట్ డాక్టర్ రవి శంకర్, ఆర్ ఎం ఓ అబ్దుల్ అజీమ్, డిప్యూటీ డి ఎం హెచ్ వో వెంకట్ దాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ మోహన్, మెడికల్ ఆఫీసర్స్, న్యాయవాదులు మధుసూదన్ రావు, ఎస్ ఆర్ సత్యనారాయణ, శ్యాంప్రసాద్ రావు, లక్మయ్య, న్యాయ శాఖ ఉద్యోగులు ఎం కేశవ రెడ్డి, ఎన్ రాజు, బాల రాజు, వంశీ ,పాల్గొన్నారు.

## రేపటి గొప్ప సమాజానికి విద్యార్థి దశలోనే పునాది

### - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**ఆత్మకూర్, మేజర్ న్యూస్:** రేపటి గొప్ప సమాజానికి నేటి విద్యార్థి దశ నుంచే పునాదులు పడాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం నర్వ మండల పరిధిలోని కల్వాల, రాయికోడ్ గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యా వాలంటీర్లను నియమించుకోవాల్సిందిగా సూచించడం గాక తక్షణంగా రూ. 40వేల రూపాయల వేతనం అందజేశారు. అలాగే ఎల్ఈడి టీవీ తో పాటుగా, విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. తాగునీటి సమస్య తీర్చేందుకు కూడా వనరులు సమకూరుస్తానని బంగ్లా విద్యార్థులకు హామీ ఇచ్చారు. అంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల తీరు పిల్లల జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వాటికి ఆకర్షితులవ్వొద్దని సూచించారు. సెల్ఫోన్లకు వీలైనంత దూరంగా ఉండడం మేలని పేర్కొన్నారు. ఈ దశలోనే పిల్లల్లో శారీరక దృఢత్వం, మానసిక పరివర్తన అవసరమన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజానికి దిక్సూచి కావాలన్నారు. రేపటి గొప్ప సమాజానికి నేటి విద్యార్థి దశ నుంచే పునాదులు పడాలని బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఊట్కూర్ భాస్కర్, నారాయణపేట జిల్లా అధికార ప్రతినిధి నర్సం గౌడ్, నర్వ మండల పార్టీ అధ్యక్షులు తీలేటి అజిత్ సింహారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రామాంజి, సాయిలు,హనుమంతు, రాయికోడు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్,నరసింహులు, ఎండి షఫీ ఉద్దీన్ తదితరులు ఉన్నారు.

## లేబర్ కార్డు ప్రయోజనాలపై అవగాహన సదస్సు సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్




**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గుడ్డెం దొడ్డి గ్రామంలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు నమోదు విధానం, కార్డు పొందడం వలన లబ్ధిదారులకు చేకూరే ప్రయోజనాలు వివరించుటకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో భవన ఇతర నిర్మాణ రంగాలలో పనిచేసే కార్మికులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సం. నుండి 60 సం. వరకు వయసు కలిగిన అందరూ మీ సేవలో కేవలం రూ. 110/- రుసుము చెల్లించి వారు అప్లికేషన్ ను ఎంటర్ చేయించి లేబర్ ఆఫీస్ కు నేరుగా సంప్రదించి కార్డులు పొందవచ్చని తెలిపారు. లేబర్ కార్డులు ఇస్తామని మధ్యవర్తులు దళారులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా వారి చేతిలో మోసపోవద్దని సూచించారు. ఈ విషయంలో మోసపోయిన వారు ఉంటే డబ్బులు వసూలు చేసే వారి పైన సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేయవలసిందిగా ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు మోహిన్ పాషా, టి యు సి ఐ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సవటకుంటకు నీరు అందించిన విజేందర్ రెడ్డి.



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజేందర్ రెడ్డి గురువారం రైతుల కోరిక మేరకు జెసిబి సహాయంతో సవట కుంటకు నీరు అందించారు. కే ఎల్ ఐ కాలువ నుండి సవటకుంటకు నీరు వచ్చే పిల్లకాల్వ పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా ఉండడంతో రైతులు తమ దృష్టికి తేవడం జరిగిందని వెంటనే స్పందించి తన సొంత డబ్బులతో జెసిబి తో కాలువ పనులు చేయించడం జరిగిందని విజయేందర్ రెడ్డి తెలిపారు, రైతులకు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తేవాలని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు, రైతులు ముసలయ్య, మల్లయ్య, సైదులు, పరశురాం, శివ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## దళితుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం పని చేస్తుంది

## -ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గత ప్రభుత్వం భూమిలేని 50 మంది దళితులకు అందజేసిన 150 ఎక రాల్లో ఉచిత బోర్లు డ్రిల్ చేసే కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం చేపట్టింది. ఇద్దరు రైతులకు కలిసి ఒకటి చొప్పున మొత్తం 23 బోర్లను జిల్లా ఎస్సీ కార్పోరేషన్ అధికారులు దగ్గరుండి డ్రిల్ చేస్తుండగా ఆనంద్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీటికి గాను ప్రభుత్వం రూ. 19 లక్షలను మంజూరు చేసింది. ఇవి కేవలం బోర్ల డ్రిల్లిం గ్కు మాత్రమే వెచ్చిస్తున్నారు. తర్వాత విద్యుత్ శాఖ ద్వారా అంచనాలు వేయించి విద్యుత్ సరఫరా, మోటార్లు అందజే యనున్నట్లు పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్సీ కార్పోరే షన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ వెల్లడించారు. ఈ కార్యక్రమం లో రమాదేవి. జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి,బి.అశోక్ బాబు,నరేష్. ప్రదీప్, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి.

### 8 వ తేదీ నా జరిగే ప్రదర్శనను విజయవంతం చేయండి



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తను ఎన్నికలలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యారంగానికి అత్యల్పంగా 7% నిధులను మాత్రమే కేటాయించి ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధిని గాలికి వదిలేసిందని విద్యా పరిరక్షణ కమిటీ నేతలు రెడ్డప్ప హైమావతి విమర్శించారు. విద్యారంగానికి కనీసం గా 15% నిధులు కేటాయించి రాబోయే కాలంలో 20% పెంచుతామని మొండి చేయి చూపిందన్నారు ఈసారి బడ్జెట్లో కనీస నిధులుగా 15% కేటాయించి క్రమంగా 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ 8 తారీఖున జరిగే ప్రదర్శనలు విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రదర్శనకు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ గారు ముఖ్య అతిథులుగా పాల్గొంటారనీ, విద్య పరిరక్షణ కమిటీ భాగస్వామ్య సంఘాలు అధిక సంఖ్యలో తమ సభ్యులు పాల్గొనేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు వెంకటప్ప, గజలప్ప ఉదయ్ కుమార్, డిటిఎఫ్ నాయకులు సూర్యచంద్ర యువజన సంఘం నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాలలు రిటన్ గిఫ్ట్ ఇస్తారు!

- రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్.
- ఎస్సీ వర్గీకరణ ఏకపక్షంగా జరిగింది
- పార్లమెంట్ ద్వారా జరిగే వర్గీకరణ అసెంబ్లీ ద్వారా చేయడం ఒక కుట్ర
- బిజేపి రాష్ట్రాలలో ఎక్కడైనా జరిగిందా?



**మహబూబ్ నగర్,మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాలలు రిటన్ గిఫ్ట్ ఇస్తారని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని స్థానిక ఎస్సీ కమ్యూనిటి భవన సముదాయ ప్రాంగణంలో జాతీయ మాలమహానాడు స్టేట్ కో-ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ పాల్గొన్ని మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ లో ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ అంశం పూర్తిగా అశాస్త్రీయమైనదని, సూప్రీంకోర్ట్ తీర్పుకు విరుద్ధంగా వర్గీకరణ చేపట్టారని విమర్శించారు. కాంగ్రేస్ పార్టీకి అండగ నిలబడిన మాలలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని వాపోయారు, వర్గీకరణకు పూర్తిగా మద్దతిచ్చిన బిజేపి ప్రభుత్వం తమ రాష్ట్రాలలో ఎందుకు వర్గీకరణ అమలు చేయడం లేదని ప్రశ్నించారు.ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియదా అని ప్రశ్నించారు, మోడీ, చంద్రబాబు ల మెప్పుకోసమే రేవంత్ రెడ్డి దళితులను విభజించాడని అన్నారు, వర్గీకరణ ప్రక్రియ 2011 జనాభా లెక్కల ప్రకారం జరగడమే శాస్త్రీయం కాదని అన్నారు. మాలల జనాభా ను పూర్తిగా తక్కువ చేసి చూపించారని అన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మాలలు మరింత పోరాటాలకు రోడ్ల మీదకు రావాలని అన్నారు. మాలమహానాడు గా మాలలకు జరుగుతున్న అన్యాయంపై గడప గడపకు వెళ్ళి పోరాట చైతన్యాన్ని నింపుతామని అన్నారు. ఈ సమావేశంలోజాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, జిల్లా అధ్యక్షులు గండీటి చిన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గోనెల ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి మహేందర్, గుడ్ల రవికుమార్, వాల్తాటి ఆంజనేయులు, బ్యాగరి యాదయ్య, బెండ శ్రీనివాస్, గాజ రవి, హరిప్రసాద్, సహదేవ్. సూర్య రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కులగణన సర్వే పెద్ద బొగస్..!!

- సర్వేలో క్రిస్టియన్ మతస్థుల లెక్క లేదు..చర్చిలు ఎందుకు?....
- రఘువీర్ యాదవ్ , కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది
- సర్వేను బీసీ కమిషన్ కూడా అభ్యంతరం తెలిపింది.....
- మిర్చి వెంకటయ్య మాజీ పట్టణ అధ్యక్షులు
- ఇతర కులను బీసీలో చేర్చి అన్యాయం చేస్తున్నారు...
- పోషల్ వినోద్ బిజేపి పార్టి పట్టణ అధ్యక్షులు



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే మొత్తం తప్పుల తడకగా ఉందని బీజేపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో కుల గణన సర్వే పై బీజేపీ పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ కుమార్ పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ కుల గణన కు బీజేపీ వ్యతిరేకం కాదు కాని తప్పుడు లెక్కతో తక్కువ చూపడం వ్యతిరేకం అన్నారు. కులాలను విడగొట్టడం చిల్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేపట్టిన కుల గణన సర్వే వెనక కుట్ర దాగుందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో మొత్తం మీద క్రిస్టియన్ లు లేనట్లు చూపుతూ వారిని ఎస్సీ కులాలతో కలిపినారు. మరి క్రిస్టియన్ లు లేనప్పుడు చర్చి లు ఎందుకు వాటిని ప్రభుత్వ పరం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కుల గణన సర్వేలో మెజార్టీ గా ఉన్న కులాలు ముదిరాజ్ ల తర్వాత యాదవ్ లు గౌడ్ ల ను జనాభా తక్కువ చూపడం ముదిరాజ్ లు బీసీ డి నుండి ఏ లోని మార్చాలని కుర్వ యాదవ్ లు ఎస్సీ రిజర్వేషన్ లు కల్పించాలని చేస్తున్న తరుణంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిక్కుల్లో పడుతున్న బావనంతో అట్టి కులాలను తప్పుడు లెక్కలతో తక్కువ చూపుతూ తప్పించుకుంటుందని ఈ కుల గణన నుండి బీసీ లకు ఎక్కడ న్యాయం జరగలేదని అదేవిధంగా బీసీ కమిషన్ కూడా కుల గణన సర్వే ను తప్పు పట్టిందని గుర్తు చేశారు మాజీ పట్టణ అధ్యక్షులు మిర్చి వెంకటయ్య బీసీ లకు ఈ విధమైన అన్యాయం చేస్తే బీసీలమంత ఏకమై ప్రభుత్వం పై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడమని హెచ్చరించారు. బీసీ కుల శాతం పూర్తిగా తగ్గించి తప్పుడు లెక్క చూపుతుందని గత ప్రభుత్వం లో సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ లు 53 శాతం ఉంటే కాంగ్రెస్ చేసిన కుల గణన సర్వేలో 42 శాతం ఉన్నట్లు తప్పుడు లెక్కలు చెబుతున్నారు. పది సంవత్సరాల్లో జనాభా పెరుగుతుంది కానీ తగ్గదు అలాంటిది బీసీ కుల జనాభా దాదాపు పది శాతం తగ్గినట్లు లెక్కలు చెబుతున్నారు. ఇతర కులను బీసీలో చేర్చి ఎక్కువ చూపడం బీసీ లకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఎవరు కుర్చోరని కాంగ్రెస్ కు బీసీ ల గుణపాఠం తప్పదని బిజేపి పార్టి పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ అన్నారు ఇట్టి కార్యక్రమంలో సత్య నారాయణ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక, జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దార్, ఎంపీడీవో





**కృష్ణ మేజర్ న్యూస్ :** మండలంలోని కున్సి లో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి నిజాముద్దీన్ తో కలిసి తహశీల్దార్ బి.వెంకటేష్,ఎంపీడీవో జానయ్య గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచనలు, సలహాలు సూచించారు. హైస్కూల్ లో కూరగాయలతో కూడిన సాంబార్ పప్పు ను తహశీల్దార్ , ఎంపీడీవో పరిశీలించి సాంబార్ లో ఎక్కువ మొత్తంలో నీళ్ళు ఉండటం పట్ల తగినన్ని మోతాదులో నీళ్ళు ఉండాలని మళ్లీ పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్ని తహశీల్దార్, ఎంపీడీవో హెచ్చరించారు. విద్యార్థులకు మంచీ నీటిసౌకర్యంపై వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలను అడుగగా బోరు బావి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపయోగంలో లేని వాటర్ ప్లాంట్ ను వారు పరిశీలించి, వాటర్ ప్లాంట్ ను రిపేర్ చేయించి పాఠశాలకు అందిస్తానని ఎంపీడీవో పేర్కొన్నారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల గదిలో భద్రపరిచిన బియ్యాని వాటి నాణ్యతలు పరిశీలించారు. ప్రతి రోజూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పలు రికార్డ్, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్,మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్,ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల వృత్తి ఎంతో పవిత్రమైనది

### - టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్



**గోపాలపేట మేజర్‌న్యూస్:** జర్నలిస్టుల వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆ విలువను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టులదని టి యు డబ్ల్యూ జే ఐజేయు రాష్ట్ర కార్యదర్శి గుండ్రాది మధు గౌడ్ తెలిపారు గురువారం మండల కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్ లో గోపాలపేట రేవల్లి మండలాలకు సంబంధించిన ఐజేయు టి యు డబ్ల్యూ జే సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు జర్నలిస్ట్ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆ వృత్తికి కళంకం తీసుకువచ్చే పనిని ఎవరు చేయకూడదని అన్నారు అక్రిడేషన్ కార్డులు కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు ఉచిత వైద్యం విద్య అందించేందుకు రాష్ట్ర కమిటీ పని చేస్తుందని ఇందుకుగాను రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరావు జాతీయ మాజీ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి శ్రీనివాసరావు విజయ్ రాజు లు ఉన్నారు అనంతరం రేవల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు.

## శ్రీశ్రీ పెద్ద చింతరేవుల బ్రహ్మోత్సవంలో పాల్గొన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. స్నిగ్ధా రెడ్డి



**ధరూర్ మేజర్ న్యూస్:** మండలపరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజ నేయస్వామి బ్రహ్మో త్సవాల భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. స్నిగ్ధా రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,అసెంబ్లీ కో కన్వీనర్ రామాంజనేయులు, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు క్రిష్ణ వేణి బిజెపి సీనియర్ నాయకులు హనుమంతరాయ,రాజేష్ అయ్యా, దరూర్ కిష్టాన్న, రఘు గౌడ్, కృష్ణం రాజు, ఢిల్లీ వాలా క్రిష్ణ,తరుణ్, బాబు రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సైగా పదోన్నతి పొందిన భువనయ్యను అభినందించిన జిల్లా ఎస్పీ



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వర్తిస్తున్న భువనయ్య ఎస్సైగా పదోన్నతి పొంది గురువారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ని క్యాంప్ కార్యాలయంలో పులాబొకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ భువనయ్యకు టూ స్టార్స్ తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది అని విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత ఉత్సాహంగా పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు.

## అసలైన కార్యకర్తలు కాదు



**గోపాలపేట మేజర్‌న్యూస్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో చేరినఏదుల మండలానికి చెందిన వారు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారు కారని సింగిల్ విండో డైరెక్టర్ గోపాల్ యాదవ్ కోట్ల నరేందర్ రెడ్డి ఉమ్మడి మండలాల ఇన్చార్జి సత్య శిలా రెడ్డి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొంకి వెంకటేశులు గురువారం సాయంత్రం విలేకరులతో తెలిపారు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు కారని వీళ్లంతా టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టౌన్ అధ్యక్షు లు శివన్న ఉపాధ్యక్షులు నాగేష్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు సుధాకర్ రావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి బాల పీరు వెంకటయ్య శేఖర్ కృష్ణయ్య రాములు బాలయ్య సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

# భగ్గు మంటున్న బంగారం ధరలు



### - అదే దారిలో వెండి - పెళ్లిళ్ల సీజన్లో వెలవెల బోతున్న దుకాణాలు
### - అడ్వాన్సు ఆర్డర్లతో ఇరకాటంలో పడిన నగల వ్యాపారులు



**జడ్చర్ల మేజర్‌న్యూస్:** అమాంతంగా బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారు కరువై దుకాణాలు వెలవెల బోతున్నాయి. బంగారంతో పాటు వెండి ధర రోజురోజుకూ కొండెక్కుతుండడం గమనార్హం గత వారం రోజులుగా ఈ పెరుగుదల మొదలవడంతో అటు వ్యాపారులు ఇటు వినియోగదారులు ఆందోళనకు గురి అవుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కావడం కూడా బంగారం ధర శర వేగంగా పెరగడానికి కారణంగా వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్ వివరాల ప్రకారం.. 24 క్యారట్ల బంగారంపై రూ. 1,040 పెరగగా, 22 క్యారట్ల బంగారంపై రూ. 950 పెరిగింది. దీంతో 24 క్యారట్ల బంగారం ధర రూ. 87వేలకు చేరగా.. 22 క్యారట్ల బంగారం రూ.79,050గా నమోదైంది. ఇక కేజీ వెండి ధర రూ. 97,302గా ఉంది.

**సర్వత్ర ఆందోళన..** బంగారం ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పసిడి ఆభరణాలు కొనుగోలు చేసే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అంతేగాక రోజురోజుకూ పెరుగుతున్న బంగారం ధర చూస్తుంటే అడ్వాన్స్ తీసుకున్న నగల వ్యాపారుల్లో సైతం ఆందోళన నెలకొంది. ప్రస్తుతం బంగారం ధర చరిత్రలో మొదటిసారిగా రూ. 87 వేల మార్కుకు చేరుకుందని స్వర్ణకారులు పేర్కొంటున్నారు. ధరల పెరుగుదల ఇలానే కంటిన్యూ అయితే.. అతి త్వరలోనే లక్ష రూపాయలు దాటడం ఖాయంగా కనిపిస్తోందని అంచనా వేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ ను దృష్టిలో ఉంచుకొని బంగారం ధర పెరగక ముందే అడ్వాన్సులు ఇచ్చిన వినియోగదారులతో నగల వ్యాపారులకు పెద్ద చిక్కే వచ్చి పడింది. వినియోగదారుతో ఖాయం చేసుకున్న పాత ధరకే నగలు చేయించి ఇవ్వాల్సి ఉండడంతో నగల వ్యాపారులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. అంతేగాక పెరిగిన బంగారు ధరల కారణంగా ప్రజల ఆలోచన విధానాల్లో కూడా మార్పు వస్తుందని వ్యాపారులు అంటున్నారు. చిన్న చిన్న వేడుకలకు సైతం మాసం ,రెండు మాసాలతో బంగారాన్ని గిఫ్టుగా ఇచ్చేవాళ్లు సైతం పెరిగిన ధరలను చూసి బంగారం బదులు కవర్లో డబ్బులు పెట్టి ఇస్తే సరిపోతుంది అనే భావనకు వచ్చారని పేర్కొంటున్నారు. బంగారు దుకాణాలు వెల వేలకు ఇది కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు.



***అడ్వాన్సు ఆర్డర్లతో నష్టం - భాస్కరాచారి, ఆ శ్రీజ జ్యువెలర్స్ జడ్చర్ల***

వివాహాలు నిశ్చయించుకుని మూడు, నాలుగు నెలల ముందుగానే నగల కోసం అడ్వాన్స్ ఇచ్చి ఆర్డర్ చేసిన వినియోగదారులకు బంగారు నగలను పాత రేటు ప్రకారమే చేసి ఇవ్వాల్సి ఉంటుంది. పాత రేటుకు, కొత్త రేటుకు రూ.7వేలు తేడా ఉండడంతో పెద్దపెద్ద ఆర్డర్లు అడ్వాన్సుగా తీసుకున్న వ్యాపారులు నష్టపోతారు. ప్రస్తుతం నగల వ్యాపారులకు ఇది మేజర్ సమస్యనే.

## గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల భద్రత పోషణ ఆరోగ్య విద్యాభివృద్ధికి కృషి చేయాలి

### - జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్




**అలంపూర్ మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల భద్రత, పోషణ,ఆరోగ్య, విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు భద్రత, పోషణ, సాధికారత, ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళలను బలోపేతం చేయడం ద్వారా పిల్లల సమస్యలను సమర్థంగా పరిష్కరించవచ్చని అన్నారు.బాల్య వివాహాల నిరోధం అత్యంత ముఖ్యమని,18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలు, 21 సంవత్సరాలు నిండే వరకు మగపిల్లలు వివాహం చేసుకోవద్దనే అవగాహన తల్లిదండ్రులకు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గట్టు, కె.టి.దొడ్డి మండలాల్లో ఈ అవగాహన కార్యక్రమాలను మరింత బలపర్చాలని ఆదేశించారు. 15 నుండి 18 ఏళ్ల వయస్సు కీలకమైన దశ కావడంతో, ఈ దశలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు.10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు మధ్యలో విద్యాభ్యాసం మానేసిన విద్యార్థులు తిరిగి పాఠశాలలు, కళాశాలలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత (అనీమియా) నివారణ కోసం గ్రామీణ స్థాయిలో రక్తపరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు సరైన పోషణ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ మహిళా సంఘాలు ప్రభుత్వ అనుకూల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిఫామ్ కుట్టడం వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని, గ్రామ స్థాయిలో సక్రమంగా పని చేయాలని, ఉత్సాహంతో చురుకుగా పాల్గొని సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,యూనిసెఫ్ స్టేట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఏపీడి నరసింహులు,గ్రామ సంఘాల ప్రతినిధులు,సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

### - నాగర్ కర్నూల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** సమాచార హక్కు చట్టం పై అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉండాలని నాగర్ కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్ అన్నారు. గురువారం అచ్చంపేట పట్టణంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి అధ్యక్షులు సభ్యులు కలిసి ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి న్యాయవాది గంగాపురం రాజేందర్నుమర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గంగాపురం రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కొరకు ఏర్పాటు చేయబడిన వ్యవస్థను జవాబు దారితనంతో అవినీతి రహితంగా పని చేయాలంటే ప్రజలు తమ బాధ్యతను సక్రమంగా పోషించాలని అని ఆయన కోరారు.ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందని ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరిచి సహ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని సభ్యులను కోరారు. కొన్ని ప్రభుత్వాలు ఈ సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి అజీజ్ కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించాలి : మండల విద్యాశాఖాధికారి బషీర్ అహ్మద్



**లింగాల, మేజర్ న్యూస్:** విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగే విధంగా ఉపాధ్యాయులు బోధించినప్పుడే విద్యార్థుల నుండి మంచి ఫలితాలు పొందవచ్చునని మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మానాజీపేట,రాంపూర్, వల్లభాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత శాతం పెంచడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని అన్నారు. విద్యార్థులకు ప్రోత్సహిస్తూ వారికి సులభమైన రీతిలో పాఠ్యాంశాలను బోధించడానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ విద్యా ప్రమాణాలు మెరుగైన రీతిలో ఉండే విధంగా కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులు రాణించగలరని కాబట్టి విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రమాణాలు పాటించి నాణ్యమైన పౌష్టికమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీలకు ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.

## వారం రోజుల్లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందిస్తాం మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్





**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** వారం రోజుల్లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందిస్తామని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను తహసిల్దార్ ఇబ్రహీంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మరమత్తులను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రెండు కోట్ల విధులు వేచించి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా వారం రోజుల్లో లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు చీమ్మల శ్రీకాంత్ రెడ్డి, నాయకులు శానవాజ్ ఖాన్, చిన్న రాంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎజస్, గోరటి శ్రీనివాసులు, హన్మనాయక్, చిన్న, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాని యాదవ్, జమ్ముల శ్రీకాంత్ పడకంటి వెంకటేష్ దున్న సురేష్ లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

## ఈనెల10న నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి



**నవాబుపేట్ మేజర్‌న్యూస్:** ఈనెల10వ,తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన రోజును పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో, మండలంలోని అన్ని గ్రామాల అంగన్వాడీ టీచర్లకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో జయరాం నాయక్,ఎంఈఓ నాగ్యనాయక్ హాజరైనారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈయొక్క కార్యక్రమానికి అందరూ సహకరించాలని అన్నారు, ఎంఈఓ మాట్లాడుతూ ఈకార్యక్రమానికి అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. మెడకల ఆఫీసర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 1నుంచి19 సంవత్సరాల వయసు గల పిల్లల సంఖ్య 12,182 ఉన్నారని, ఈనెల10న అందరికీ (అల్బెండజోల్) నులిపురుగుల నివారణ మాత్రలు అందించడం జరుగుతుందని, ఎవరైనా అనువార్య కారణాలవల్ల తీసుకోకుంటే, ఈనెల17వ, తేదీ వరకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, బాలమ్మ, శ్రీనివాసులు, విజయ, జయశీల, రాఘవేందర్, శరభలింగం, భవానిసింగ్, శ్రీనివాసులు, వాహబ్ పాల్గొన్నారు.

## బండారయిపాకుల సర్పంచ్ పదవి ఎస్సీ సామజిక వర్గానికి రిసర్వేషన్ చేయాలి.

### ఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మిద్దె నరసింహ



**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బండారయిపాకుల గ్రామానికి స్థానిక సంస్థ సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ సామాజిక వర్గానికి రిసర్వేషన్ చేయాలి అని గురువారం గ్రామ బి ఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మిద్దె నరసింహ డీపీవో అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న 1500 ఓటర్ లలో సుమారు ఎస్సీ సామాజిక వర్గం ఓటర్ లు ఉన్నారని కానీ గత 30 సంవత్సరలుగా తమ వర్గానికి రోటేషన్ పద్ధతిలో కూడా సర్పంచ్ పదవి కి అవకాశం ఇవ్వకుండా తమకు అన్యాయం చేస్తున్నారు. కనీసం ఈసారైనా తమ ఎస్సీ వర్గానికి సర్పంచ్ పదవికి రీసర్వేషన్ కల్పించాలి అని జిల్లా డీపీవో అధికారికి వినతి పత్రం ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసింహ వెంట సంఘం ఉపాధ్యక్షులు కర్తల బంగారయ్య, ప్రధాన కార్యదర్శి మిద్దె రాముడు, సభ్యులు మిద్దె రాములు, మిద్దె శ్రీరాములు పాల్గొన్నారు.

# పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

### - శాఖపూర్ విద్యార్థులతో పెబ్బేరు జూనియర్ కళాశాల అధ్యాపక బృందం

### - సమయపాలన పాటించి నాణ్యమైన విద్యను అందిస్తామని హామీ ఇచ్చిన సిబ్బంది





**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** నాణ్యమైన ఇంటర్ విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని..ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరు అధ్యాపకులు జిల్లా ఉన్నత పాఠశాల శాఖాపూర్ గ్రామ విద్యార్థులకు సూచించారు గురువారం ఆ పాఠశాలలో ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పై చదువులు చదువుకోవడానికి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్స్ వచ్చే అకాడమీ ఇయర్ జూన్ లో పొందడానికి మా ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరులో చేరవలసిందిగా , శాఖాపూర్ పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ క్లాసు, కళాశాల అధ్యాపకులు సి కృష్ణయ్య, నవీన్ కుమార్ ఇవ్వడం జరిగింది. మన మండలంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, మనలాంటి పేద వర్గాల విద్యార్థులు అభ్యసించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని. ఆ కళాశాల సద్వినియోగం చేసుకోవాలని ,ఆ కళాశాలలో పనిచేసే మేమందరం మీ ఉన్నతికై , మీ భవిష్యత్ అందరి చదువుల అభివృద్ధికై, మేమందరం నిరంతరం పాటు పడతామని, క్రమశిక్షణ అంకితభావంతో కూడిన చదువును మీకు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా బద్ధకం, వాయిదా వేయడం, తప్పించుకునే తత్వం, విద్యార్థులు విడనాడాలని తెలియజేశారు. విద్యార్థులు ఎప్పుడు కూడా నిరంతరం భవిష్యత్తు నిర్మాణం కోసం కష్టపడి చదవాలని, గొప్ప గొప్ప దేశభక్తి నాయకులను ప్రేరణగా తీసుకోవాలని, మాజీ రాష్ట్రపతి, సైంటిస్ట్ కీర్తిశేషులు అబ్దుల్ కలాం ఆచరించిన ఆదర్శాలను ఆదర్శంగా విద్యార్థులు తీసుకోవాలని అక్కడే విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారుచేశారు. మా కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఈసి, హెచ్‌ఈసి తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం మా కళాశాల నుండి ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో రాణిస్తున్నారని, మకళాశాల గుర్తుకు తీసుకొస్తున్నారని తెలియజేశారు. ఆ శాఖాపూర్ పాఠశాల ఉపాధ్యాయులను, మీ విద్యార్థులను, మా కళాశాలలో చేర్పించడానికి ప్రోత్సహించి ప్రభుత్వ కళాశాలలకు సహాయ సహకారాలు తోడ్పాటు అందించవలసిందిగా ఆ పాఠశాల ఉపాధ్యాయులను పూల బొకే అందజేస్తూ అభ్యర్థించడం జరిగింది. జిల్లా ఉన్నత పాఠశాల శాఖాపురం గజిటెడ్ హెచ్ఎం మల్లికార్జునుడు మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలలు ,ప్రభుత్వ పాఠశాలలు మనమందరం ప్రభుత్వ సెక్టార్ లో పనిచేస్తున్నాం, కళాశాల అభివృద్ధికై ఖచ్చితంగా మేమంతా ఉపాధ్యాయులు అందరూ కూడా మీకు తోడ్పాటును అందిస్తామని, మా పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులు మీ కళాశాలలో కచ్చితంగా చేరుతారని, ప్రతి సంవత్సరం మా పాఠశాల విద్యార్థులు వచ్చి చేరుతున్నారని, మీరు మేము ప్రభుత్వ సెక్టార్ లో పనిచేస్తున్నాం, పేద బడుగు బలహీన వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధి మన అందరి ప్రధాన ధ్యేయం అని తెలియజేశారు. విద్యార్థుల చదువుల ఉన్నతికే మనమందరం కలిసి కట్టుగా పనిచేసే సహకరించుకుందాం అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేర్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు కృష్ణయ్య , ఇంగ్లీష్ అధ్యాపకుడు నవీన్ కుమార్, ఆ పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

## సెమీ స్కిల్డ్ మస్టరైన ఇవ్వాలి లేదా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులనైనా భర్తీ చేయాలి

### - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్ డిమాండ్



**తెలకపల్లి మేజర్ న్యూస్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సీనియర్ మేట్లకు సెమిస్కిల్ మస్టర్ నైన ఇవ్వాలి లేదా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులైనా భర్తీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్ డిమాండ్ చేశారు గురువారం మండల కేంద్రంలోని సీనియర్ మెట్ల సమావేశానికి హాజరైన సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నూతనంగా ఏర్పడిన కొత్త గ్రామపంచాయతీలు మరియు పాత గ్రామపంచాయతి లలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల స్థానంలో గత ఆరేడు సంవత్సరాల నుంచి ఆయా గ్రామాల్లో చదువుకున్న నిరుద్యోగులు సీనియర్ మేట్లగా పనిచేస్తూరని అన్నారు. కొత్త గ్రామపంచాయతీలో పని చేయిస్తున్న సీనియర్ మేట్లకు నాటి నుంచి నేటి వరకు వేతనము లేక మరియు ఫీల్డ్ అసిస్టెంట్ గా గుర్తింపు ఇవ్వకుండా వీరికి కనీస వసతులు కూడా కల్పించడం లేదని కూలితో పాటుగా వందరోజుల మస్టరు ఇస్తారు తప్ప, 100 రోజుల పని దినాలు ముగిసిన తర్వాత కూడా పనులు మాత్రం సంవత్సరం పొడవునా కూలీలకు పనులు కల్పించాలని వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఇది ఎలా సాధ్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు అధికారులు ప్రభుత్వము సీనియర్ మెట్ల జీవితాలతో చెలగాటమాడడం ఇది ఎంతవరకు సమంజసమని అని విమర్శించారు. కాబట్టి సీనియర్ మేట్లకు సపరేటు (సెమీస్కిల్డ్) మస్టర్ అయినా ఇవ్వాలి లేదా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులైన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా నెల సరి వేతనంతో పాటు సెల్ ఫోన్ రీఛార్జి పని ప్రదేశానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనం పెట్రోల్ ఖర్చు కూడా ప్రభుత్వమే భరించి అమలు పరచాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం అధికారులు కల్పించుకొని తొందరగా అమలు పరచకపోతే జిల్లావ్యాప్తంగా ఉన్న సీనియర్ మేట్లను సమీకరించి వర్క్ డన్ చేయించి మండల కేంద్రాల్లో ధర్నాలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపు ఇస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీనియర్ మెట్ల సంఘం మండల అధ్యక్షులు చిన్నరాయుడు ఉపాధ్యక్షులు పరశురాం సహాయ కార్యదర్శి అర్చన సంఘం సభ్యులు బాలస్వామి దశరథం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో స్వయం ఉపాధి పొందవచ్చు

### - ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** ఉట్కూరు మండలం పెద్ద జట్రం రైతు వేదికలో గురువారం షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పొందడంపై మహిళలకు మూడు నెలల ఉచిత కొట్టు శిక్షణ కేంద్రాన్ని న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ నైపుణ్యం రాష్ట్రమంతా ఇస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు 11,000 మంది శిక్షణ పొంది 9,000 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. శిక్షణ కొరకు ఇంతవరకు 120 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. వివిధ రంగాల ద్వారా ఒప్పందం చేసుకుని శిక్షణ ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో 20 శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిలో అభివృద్ధి సాధించారని తెలిపారు. మహిళలకు నారాయణపేట జిల్లాలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందజేసి అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. వారు పాఠశాలలు హాస్టల్స్ యూనిఫామ్ కొట్టడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్డర్లు పొంది పని ప్రారంభించి ఉపాధి పొందవచ్చు అన్నారు. న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ నాక్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. దేశంలో అనేక సంస్థలు నాక్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకొని ఉద్యోగాలు పొందుతున్నాయని తెలిపారు. జెసిబి ఆపరేటర్ కన్స్ట్రక్షన్స్ సూపర్వైజర్ ల్యాండ్ సర్వే ట్రైనింగ్ ఆడపిల్లలకు స్వయం ఉపాధి రంగం తదితర వాటిపై 20వేల మందికి ఇంతవరకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈజిఎం డిఆర్డిఓ లాంటి సంస్థలు వారి సౌజన్యంతో ఇతర ప్రైవేటు సంస్థలు కూడా శిక్షణ తీసుకుని వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ. డి.ఎస్సీ కార్పొరేషన్ అబ్దుల్ కలీల్, డి పి ఆర్ ఓ రషీద్, మండల్ స్పెషల్ ఆఫీసర్ ఉమాపతి,ఎడి నాక్ శివశంకర్, కోఆర్డినేటర్ హాజమ్మ, మాజీ సర్పంచ్ శైలు గౌడ్,అశోక్ బాబు, కథలాప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి సిమెంటు అందజేత : ఉప్పల



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఉప్పల వెంకటేష్ వంద బ్యాగుల సిమెంటును తన అనుచరుల ద్వారా అందజేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సిమెంట్ ను అందజేసినట్లు తెలిపారు. ఆలయ నిర్వాహకులు ఉప్పల వెంకటేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లికట్ట బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు భీమయ్య, కేశవులు, రవి, స్వామి, కృష్ణ, రమేష్, శ్రీకాంత్ ,వేణు, వెంకటయ్య ,బంగారి ,శ్రీను, ఆంజనేయులు ,మల్లేష్, ప్రశాంత్, రమేష్ ,తిరుపతి, రవి ,వెంకటయ్య ,బాలయ్య, బాల చిన్నయ్య, మల్లయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం మాజీ సర్పంచు బృంగి ఆనంద్ కుమార్



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీ సర్పంచు బృంగి ఆనంద్ కుమార్ తెలిపారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని బలరాం నగర్ కాలనికి చెందిన అమిర్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆనంద్ కుమార్ బాధితుని నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులు ఓదార్చి మనోధైర్యం కల్పించారు, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు, ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాసులు, నాయకులు దామోదర్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, దున్న సురేష్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం




**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన రాస మోని నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆర్థిక సహాయం కింద 5000 రూపాయలు పంపించగా నాయకులు అందజేశారు మృతి చెందిన విషయాన్ని ఉమ్మడి మండలాల ఇన్చార్జి సత్య శిలా రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి మానవతా దృక్పథంతో రూపాయలు పంపించగా నాయకులు అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లోకా రెడ్డి గంధం వంశీకృష్ణ అంకుర్ నరసింహ ముచ్చుమారి వెంకటయ్య నాగశేషి ముచ్చుమారి బురాన్ జోగు బుద్ధయ్య కాటమోని శీను సింగుమారి కుర్మయ్య గొల్ల దస్తగిరి తిరుపతి యాదవ్ నక్క రాములు తదితరులు.

## జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి





**మహబూబ్ నగర్ క్రైమ్ మేజర్ న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లాకు చెందిన శశాంక్ (19) నల్గొండకు చెందిన జ్ఞానేశ్వర్ (18) పట్టణంలోని మెడికల్ కాలేజీలో బీఎస్సీ చదువుతున్నారు. తెల్లవారుజామున బైక్ పై వెళుతున్న ఇద్దరూ స్నేహితులు ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నులి పురుగుల నిర్మూలన పై అవగాహన



**గోపాలపేట మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలనపై మండల వైద్యాధికారి కృష్ణకుమారి అవగాహన కల్పించారు ఈ నెల 10వ తేదీన నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని ఎంఈఓ పాఠశాల ఉపాధ్యాయులకు హెచ్ఎం లకు పంచాయతీ సెక్రటరీలకు ఆల్బెండజోల్ మాత్రల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ సిహెచ్ఓ సిద్ధ గౌడ్ ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన ఏదుల కాంగ్రెస్ నాయకులు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** ఏదుల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి లోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో చేరినట్లు తెలిపారు శశి రెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి భరత్ కుమార్ రెడ్డి నరేందర్ రెడ్డి సురేష్ రాజు బుచ్చిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు చేరినట్లు తెలిపారు ఏదుల రిజర్వాయర్ వంటి పథకాలను టిఆర్ఎస్ ప్రభుత్వమే చేపట్టిందని నిరంజన్ రెడ్డి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ వాకిట శ్రీధర్ నందిమల్ల అశోక్ శంకర్ రెడ్డి రాజు రెడ్డి మాజీ ఎంపీటీసీ రమేష్ సునీల్ కుమార్ మాజీ సర్పంచ్ శేషయ్య జాన్ తదితరులున్నారు.

## సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండల కేంద్రంలోని బసవన్న గుడి నుంచి కామన్ గడ్డ కాలనీకి వెళ్లే దారికి సిసి రోడ్డు నిర్మాణం చేపటం దుకు కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు ఉపాధి హామీ నిధుల ద్వారా దాదాపు 5 లక్షల రూపాయలతో నిర్మాణం చేపడుతున్నారు ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోంకి వెంకటేష్ సుధాకర్ రావు శ్రీనివాసరావు వెంకటయ్య నిఖిల్ యాదవ్ చిట్టెం శశిధర్ తదితరులు ఉన్నారు.

## వరంగల్ సభలో తీన్మార్ మల్లన్న రెడ్డి సామ్యాజిక వర్గం పై చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు.



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** రెడ్డి సామాజిక వర్గంపై తీన్మార్ మల్లన్న వరంగల్ బిసి సభలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తీన్మార్ మల్లన్న పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ ,సి ఐ ,డి ఎస్ పి .ల కు వినతి పత్రం సమర్పించారు.

## ఆత్మహత్య పరిష్కారం కాదు.ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి. తక్షణ సహాయం 50,000 అందజేత.





**రాజాపూర్ మేజర్ న్యూస్ :** బాలానగర్ హాస్టల్ లో మృతి చెందిన బాలిక కుటుంబానికి తక్షణ సహాయం స్థానిక నాయకుల ద్వారా 50,000 రూపాయలు అందించిన శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి.మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.పాలమూరు జిల్లా ఓబీసీ చైర్మన్ తిరుపతి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ప్రభుత్వ పరంగా ఆరాధ్య కుటుంబానికి అండగా ఉంటానని,సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు అనిరుద్ రెడ్డి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఓబీసీ మండల అధ్యక్షులు యాదయ్య,రంగారెడ్డి గూడ రాములు గౌడ్,ఏఎంసి డైరెక్టర్ భాస్కర్ గౌడ్,యాదయ్య,రమేష్ నాయక్ యువకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి. అండగా బృంగి హాస్పిటల్..



**వెల్దండ. మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన షాంపురి గణేష్ బృంగి హాస్పిటల్ హైదరాబాద్ లో మార్కెటింగ్ మేనేజర్ గా పనిచేస్తూ గత కొన్ని రోజుల క్రితం జడ్చర్ల – కోదాడ జాతీయ రహదారి శ్రీశైలం క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన షాంపురి గణేష్ కుటుంబాన్ని బృంగి హాస్పిటల్ యాజమాన్యం గురువారం పరామర్శించి ఓదార్చి అండగా మేమున్నామంటూ రూ. 2.50 లక్షల ఆర్థిక సహాయం. బృంగి హాస్పిటల్ మార్కెటింగ్ స్టాఫ్ రూ. 90 వేలు అందజేశారు. భవిష్యత్తులో గణేష్ కుటుంబానికి బృంగి హాస్పిటల్ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని వారు ఈ సందర్భంగా గణేష్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బృంగి హాస్పిటల్ యజమాన్యం. సిబ్బంది పాల్గొన్నారు.

## యుపిఎస్‌పై యుద్ధం మొదలైంది

### - ఉద్యోగుల ఆర్థికభద్రతకు ముప్పు

### - సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ



**జడ్చర్ల మేజర్‌న్యూస్:** ఉద్యోగులఆర్థిక భద్రతకు ముప్పుగా మారిన యూపీఎస్ విధానంపై యుద్ధం మొదలైందని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ అన్నారు. బాదేపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో యూపీఎస్ పై యుద్ధభేరి పోస్టర్ ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానం ను ఆమోదం తెలిపిందన్నారు. ఏప్రిల్ 1 2025 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మార్చ్ 2న ఉద్యోగ ఉపాధ్యాయులతో హైదరాబాదులో యుపిఎస్ పై యుద్ధభేరి ధర్నా చౌక్ కేంద్రంగా నిరసన కార్యక్రమం ఉంటుందని, భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ ఏకీకృత పెన్షన్ విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి,కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చింది తప్ప ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైనదని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులంతా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇంచార్జి గద్దం వెంకటేష్, జిల్లా అధ్యక్షులు సనాతన బాలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.యం.చంద్రకాంత్ , కోశాధికారి రాఘవేంద్ర ,రాష్ట్ర సాహిత్య కమిటీ సభ్యులు నరేష్, జి హెచ్ ఎమ్ చంద్రకళ, జాన్సీ, సునీల్, యుగేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిపల్లి గ్రామపంచాయతీని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**వనపర్తి రూరల్ మేజర్‌న్యూస్:** అప్పాయిపల్లి గ్రామపంచాయతీని అడిషనల్ కలెక్టర్ సంజిత్ గంగ్వార్ సందర్శించి ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన క్రాస్ వెరిఫికేషన్ చేయడం జరిగింది. నిజమైన లబ్ధిదారులను సక్రమంగా గుర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించరు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, ఎంపీ ఓ రవీంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి నర్మదా క్షేత్ర సహాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నర్వ మండల కేంద్రానికి బీటీ రోడ్డు మహర్దశ

## - 4.55 కోట్ల నిధులు కేటాయింపు



**నర్వ మేజర్ న్యూస్:** మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి గారి కృషితో ఈరోజు రాంపూర్ గేట్ నుండి నర్వ మండల కేంద్రానికి %డీ%రోడ్డు పనులకు 7 కిలోమీటర్లకు గాను, 4.55 కోట్ల నిధులను కేటాయింపులు జరిగాయి. మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో సంబంధిత పంచాయతీ రాజ్ డిఈఈ ఉపేందర్ రెడ్డి, ఏఈఈ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, అదికారులు రోడ్డు పనులకు సర్వే చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, డిసిసి జనరల్ సెక్రెటరీ నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ నాగన్నగారి వివేకవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు శరణప్ప, యాంకి వెంకట్ రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ నాయకులు నరేష్, సద్దలి ఆంజనేయ రెడ్డి,కోట్ల శ్రీనివాసులు, కుమార్ లింగంపల్లి రాజేష్,బైని గోపాల్,లంకాల మూర్తి, తిమ్మారెడ్డి, పాల్గొన్నారు.

## బాల్‌నగర్ బాలికల వసతి గృహంలో విద్యార్థి మృతితో వెల్దండలో విషాదఛాయలు..

**వెల్దండ. మేజర్ న్యూస్ :** మహబూబ్ నగర్ జిల్లా బాల్ నగర్ గురుకుల పాఠశాలలో వెల్దండ మండల కేంద్ర పరిధిలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ఆరాధ్య అనే 10 వ తరగతి విద్యార్థి గురువారం ఉరి వేసుకుని మృతి చెందడంతో వెల్దండలో విషాదఛాయన అలుముకున్నా. చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన రమేష్ – రజిత కూతురు. ఆరాధ్య గురుకుల పాఠశాలలో ఉంటూ పదవ తరగతి చదువుతుంది. పాఠశాలలో ఉరివేసుకొని మృతి చెందిందని తెలియడంతో తల్లిదండ్రులు, బంధువులు రోదనలు వెల్దండలో మిన్నంటాయి. ఆరాధ్య మృతి పట్ల మండల వాసు పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



## కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, పాలసీలను ప్రతి ఖాతాదారునికి అందజేయాలి

### - జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పాలసీలను ప్రతి ఖాతాదారునికి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపులు, సమన్వయ సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలు చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్నవి కానీ ప్రయోజనాలు చాలా గొప్పగా ఉన్నాయని తెలిపారు. జీవన్ జ్యోతి భీమా కొరకు సంవత్సరానికి రూ. 430 సురక్ష యోజనకు కేవలం 20 రూపాయలు కట్టాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుడు మరణిస్తే భీమా ద్వారా కుటుంబ సభ్యులు ఆర్థిక ప్రయోజన పొందుతారని తెలిపారు. ఇంతటి మహత్తరమైన భీమాల పై ప్రజలకు అవగాహన లేదని అందువల్ల వినియోగదారు లు బ్యాంకుకు వచ్చినప్పుడు లేదా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి భీమా పాలసీలు చేయించాలని సూచించారు. రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు తప్పకుండా భీమా చేయించాలని ఆదేశించారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని, వారందరికీ ఈ బీమా పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఖాతాదారుకు ఈ బీమా పథకాలను వివరించి, నమోదు చేసుకునేలా చేయాలన్నారు. స్వయం సహాయక బృందాల్లో ఉండే మహిళలకు ప్రతి ఒక్కరికి కేంద్ర బీమా పథకాలు వర్తింపచేయాలని డి ఆర్ డి ఓ కు సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 కడితే రూ.2 లక్షల జీవిత భీమా వస్తుందని, అదే ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే ప్రమాదం జరిగినప్పుడు పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష, శాశ్వత అంగ వైకల్యం ఏర్పడితే రూ.2 లక్షల భీమా వస్తుందని అవగాహన కల్పించాలన్నారు. గిరిజనుల ఆర్థికాభ్యున్నతికి 80 శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా ట్రైకార్ (ట్రైబల్ కార్పొరేషన్) రుణాలు కేటాయిస్తుందని, అందులోభాగంగా జిల్లాలో ఇంకా పెండింగ్ లో ఉన్న రుణాలను గ్రౌండింగ్ చేయించే విధంగా దగ్గరుండి చర్యలు తీసుకోవాలని గిరిజన శాఖ అధికారిని ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, స్థిర ఆదాయం వచ్చే నూతన యూనిట్లను స్థాపించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్య రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం ఇటుక కు డిమాండ్ ఉందని, దీనికి సంబంధించి జిల్లాలో కొరత ఏర్పడిందని ఎవరైనా ఇటుక తయారీ యూనిట్లు పెట్టేవారు ఉంటే పీఎం ఈజీపీ కింద వారికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. యువత ఎవరైనా సేవా, పరిశ్రమిక రంగంలో రాణించేందుకు ఆసక్తి ఉంటే పీఎంఈజీపీ పథకాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ వారి పొటెన్షియల్ లింక్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద నాయక్, గిరిజన శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లిఖార్జున్, ఏపిఎం సాయి, ఇండస్ట్రీస్ జీఎం, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని వేధిస్తున్న వ్యక్తి దారుణ హత్య : సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ





**చిన్న చింతకుంట, మేజర్ న్యూస్ :** కూతుర్ని వేధిస్తున్న వ్యక్తిని పట్టపగలు దారుణ హత్య చేసిన సంఘటన గురువారం మధ్యాహ్నం కౌకుంట్ల మండలం తిరుమలపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. డిఎస్పి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూరు ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ కౌకుంట్ల మండలం తిరుమలాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. నందికొట్కూరు ప్రాంతానికి చెందిన అలీ ఖాన్(33) అనే వ్యక్తి తన కూతురును వేధిస్తున్నాడని గురువారం అలీ ఖాన్ తిరుమలాపూర్ గ్రామానికి వచ్చి షేక్ అబ్దుల్ రెహమాన్ ని ఇంటి పరిసరాలలో తిరుగుతుండగా ఆవేశానికి గురైన షేక్ అబ్దుల్ రెహమాన్ మధ్యాహ్నం రెండు మూడు గంటల ప్రాంతంలో అలీఖాన్ తలపై రాడుతో బలంగా దాడి చేయడంతో కింద పడిపోయాడు.మరల బండరాయితో బలంగా తలపై వేయడంతో అలీ ఖాన్ చిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానిక ఎస్సై ఆర్ శేఖర్ హత్య సంఘటన తెలియగానే గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ తరలించి మృతుని బంధువులకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు.మృతుని బంధువుల రాగానే పూర్తి వివరాలను తెలుస్తాయని ఈ హత్య సంఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులను పహారా ఏర్పాటు చేశారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి భర్ చేయాలి

### - గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ- అచ్చంపేట అధ్యక్షులు - నల్లమల కవి గాయకులు జక్క గోపాల్ ,యాదన్న



**అచ్చంపేట మేజర్ న్యూస్ :** అచ్చంపేట పట్టణంలో గురువారం స్థానిక అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు గద్దర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నల్లమల్ల కవి గాయకులు జక్కగోపాల్ యాదన్న ఆధ్వర్యంలో గురువారం కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రజాయుద్ధం నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భారీగా ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ పదవుల కోసమో, డబ్బు కోసమో, అవార్డుల కోసమో తన జీవితాన్ని ఫణంగా పెట్టి పని చేయలేదని..తెలంగాణ కోసం, పీడిత, పేద ప్రజల కోసం, అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ పోరాడారని గుర్తు చేశారు. శరీరంలో బుల్లెట్లు ఉంచుకొని కూడా ప్రజల కోసం కొట్లాడిన వ్యక్తి గద్దర్ అని మీరు తక్కువ చేసి మాట్లాడినంత మాత్రాన గద్దర్ స్థాయి తగ్గదన్నారు. గద్దర్ పై విమర్శలు చేస్తే సూర్యుడి మీద ఉమ్మేయడం వంటిదేనన్నారు. గద్దర్ ఓ చారిత్రాత్మక వ్యక్తి..యుగ పురుషుడని కొనియాడారు. ప్రజల పాటగా ఆయన చిరస్మరణీయుడని ఆయన స్థాయిని అవార్డులు నిర్ణయించలేవన్నారు. ఇటువంటి ప్రజా నాయకుడు పేద ప్రజల ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసినటువంటి గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ ను వెంటనే కేంద్ర క్యాబినెట్ నుంచి బర్తర ఫ్ చేయాలని అచ్చంపేట గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకులు యాదయ్య మల్లికార్జున్, శ్రీశైలం అనిల్, బాలస్వామి, ఎం ఎం గౌడ్, పాండు, గాజుల లక్ష్మీనారాయణ, రాజగోపాల్, గోపాల్, సుధాకర్ , ఆనందు, చెవ్వ పాండు, ప్రసాద్ , ఇతర ముస్లిం మైనార్టీ నాయకులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనర్‌లను పనిలో పెట్టుకుంటేకేసులు : జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రం లో నిర్వహిస్తున్న భరోసా సెంటర్ ను జిల్లాఎస్పీ గురువారం సందర్శించారు. సంవత్సరకాలం పూర్తయినందున భరోసా సెంటర్ ని పరిశీలించారు ఈ సందర్భంగా సంవత్సరం పూర్తి అయినందున కేక్ కట్ చేశారు అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లాలో భరోసా సెంటర్ ద్వారా ఐతున్న పనుల గురించి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల సమక్షంలో అందరికీ వివరించడం జరిగింది. మహిళలకు భరోసా సెంటర్ ద్వారా స్టేట్మెంట్ రికార్డ్ మరియు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని భరోసా సెంటర్ సిబ్బంది మంచిగా పని చేస్తున్నారని కొనియాడారు అలాగే ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ ద్వారా మైనర్ బాల బాలికలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారి మీద కేసులు నమోదు చేసి చిన్నపిల్లలను బరోసా కల్పిస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఏడిడిఎల్ఎస్పి సిహెచ్ రామేశ్వర్ , డి సి ఆర్ బి డి ఎస్ పి సత్యనారాయణ , నాగర్ కర్నూల్ సీఐ కనకయ్య నాగర్కర్నూల్ ఎస్సై గోవర్ధన్ తో పాటు భరోసా సిబ్బంది సఖి సెంటర్ సిబ్బంది సీ టీం సిబ్బందిపాల్గొన్నారు.

# జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా సుగురు వరప్రసాద్ రావు ఎన్నిక

**- సన్మానించిన ఉపాధ్యాయ బృందం**

**- ఉపాధ్యాయుల పక్షపాతిగా పేరొందిన వరప్రసాదరావు**



**పెద్దమందడి మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లా గజిటెడ్ ఉద్యోగుల అధ్యక్షులుగా సుగురు వరప్రసాద రావు ను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించారు. వివిధ ఉద్యోగ సంఘాలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం. ఇటీవల వనపర్తి జిల్లా గజిటెడ్ ఉద్యోగుల వనపర్తి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సుగురు వరప్రసాద రావు ను జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మద్దిగట్ల, మోజర్ల హై స్కూల్ ఉపాధ్యాయ బృందం మరియు స్కూల్ కాంప్లెక్స్ లోని ఉపాధ్యాయులు శాలువతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఎం,ఈ,ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మరియు తపస్ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షపాతి, నిరంతరము ఉపాధ్యాయుల యొక్క సమస్యల పరిష్కారం ఎడల చొరవ చూపే నాయకుడు ఎస్ వరప్రసాద రావు ని జిల్లా గజిటెడ్ ఉద్యోగుల అధ్యక్షులుగా ఎన్నుకోవడం అభినందనీయమని తెలియజేశారు. జిల్లా అన్ని శాఖల ఉద్యోగుల యొక్క పెండింగ్ బిల్లులు మరియు రిటైర్డ్ ఉద్యోగుల యొక్క రిటైర్డ్ బెనిఫిట్స్ సకాలంలో ప్రభుత్వం అందించే విధంగా గెజిటెడ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.రణ్ దీప్, వెంకటస్వామి, అశ్విని భగవంతు ,శివారెడ్డి, రాజేష్,పుల్లయ్య , వెంకటస్వామి మరియు మధుసూదన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నది.

# తప్పిపోయిన హాస్టల్ విద్యార్థి



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాల్పేట మండల కేంద్రంలోని ఎస్సి హాస్టల్ లో చదువుతున్న సందీప్ నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి తప్పిపోయాడని హాస్టల్ వార్డెన్ సంతోష్ కుమార్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా బందులఇంట్లో ఉన్నట్లు తెలిసింది అని ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు వివరాలు ఉన్నాయి సందీప్ అనే విద్యార్థి బుధవారం సాయంత్రం గోపాల్పేట బస్టాండ్ దగ్గర ఒక వ్యక్తి ద్వారా నాన్నకు ఫోన్ చేయించి వెన్నెలు బ్యాగు కావాలని డబ్బులు పంపించమని అడగగా అబ్బాయి తండ్రి ఫోన్ పే ద్వారా 200 పంపించగా ఆ అబ్బాయి హైదరాబాద్ కు వెళ్ళిపోయాడు అయితే పోలీసులు తండ్రికి ఫోన్ చేయగా తండ్రి తన బంధువులకు తెలపగా హైదరాబాదులో ఉన్నట్లు తెలిసింది వెంటనే ఆ బాలుని దగ్గర బంధువులు ఉంచుకున్నట్లు తెలిపారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీకీ బిజెపి సిద్దంగా ఉంది

**- జిల్లా అధ్యక్షులు డి.నారాయణ**



**వనపర్తి టౌన్ మేజర్ న్యూస్ :** రాబోయే స్థానిక ఎన్నికలపై చర్చించడానికి ఈరోజు జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని జిల్లావ్యాప్తంగా సర్పంచి ఎంపీటీసీ, జడ్పిటిసి మున్సిపల్ ఎన్నికలకు బిజెపి పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేయడానికి అభ్యర్థులను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయిలో ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీలు మరియు మండల ఇంచార్జులను నియమించి మొదటగా పోలింగ్ బూత్ స్థాయిలో సమావేశాలు,శక్తి కేంద్రం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పోటీచేసే ఆశావావుల అభ్యర్థనలను తీసుకోవాలని పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ తరపున అండగా ఉంటామని భరోసానివ్వాలని నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రతి పోలింగ్ బూత్ కేంద్రం నుంచి పదిమంది సభ్యులతోపాటు మండల,జిల్లా కమిటీలు, మోర్చాల కమిటీలు సెల్ కన్వీనర్ పూర్తిస్థాయిలో పాల్గొనేలా జిల్లాస్థాయిలో స్థానిక ఎన్నికలపై సమరభేరి సభను నిర్వహిస్తామని ఆ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు జి.కిషన్ రెడ్డి లేదా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ స్థానిక ఎన్నికలకు సమరశంఖం పూరించనున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రెండవ పర్యాయం నియమితులైన డి.నారాయణ ను ముఖ్య నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి అయ్యగారి ప్రభాకర్ రెడ్డి సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి ఓబీసీ మోర్చా రాష్ట్ర సమన్వయకర్త చిత్తారి ప్రభాకర్ మహిళా మోర్చా రాష్ట్ర సహా కోశాధికారి జ్యోతి రమణ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి ఏ.సీతారాములు జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇంచార్జి పెద్దిరాజు ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపీనాథ్ యాదవ్ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**- జిల్లా యస్.పి యోగేష్ గౌతమ్**



**మక్తల్ మేజర్ న్యూస్ :** నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా యస్.పి యోగేష్ గౌతమ తెలిపారు. గురువారం ఉదయం నేషనల్ హైవే యన్ హెచ్-167 మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై మక్తల్ సిఐ చంద్రశేఖర్ , ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఏఈ ఆర్ అండ్ బి అభిషేక్ రెడ్డి, కాంట్రాక్టర్ మధు వర్మ లతో కలిసి జక్లేర్ చౌరస్తా నుండి కాచ్ వార్ గ్రామ రోడ్డు, మంతన్ గోడ్ క్రాస్ రోడ్, దండు క్రాస్ రోడ్, నల్లజానమ్మ టెంపుల్, మక్తల్ బస్టాండ్ చౌరస్తా, కన్యక పరమేశ్వరి దేవాలయం క్రాస్ రోడ్, దాసర్ పల్లి క్రాస్ రోడ్ వరకు మొత్తం రోడ్డు ప్రమాదాలు జరిగే యాక్సిడెంట్స్ ప్రోన్ ఏరియాస్ ను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పార్ట్స్ ని, రోడ్డు మలుపుల దగ్గర, క్రాస్ రోడ్స్ వద్ద, గ్రామాల నుండి ప్రధాన రహదారికి కలిసే చోట ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సిఐ చంద్రశేఖర్, యస్.ఐ భాగ్యలక్ష్మిరెడ్డి లు యస్.పి కి తెలిపారు. నేషనల్ హైవే మరికల్ నుండి కృష్ణ 54 కిలోమీటర్ల వరకు గ్రామాల నుండి ప్రధాన రహదారిపైకి వచ్చే ప్రతి రోడ్డు మార్గాన స్పీడ్ బ్రేకర్లు లేని చోట వేయించాలని, వాటికి వైట్ పెయింట్ తో కలర్స్ వేయించాలని యస్.పి సూచించారు. నేషనల్ హైవే పై రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రధాన చౌరస్తాల్లో బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలని, స్పీడ్ నియంత్రణ కొరకు స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని, మలుపుల దగ్గర రేడియం స్టిక్కర్స్ తో బోర్డ్స్ వేయించాలని హైవే అధికారులకు తెలిపారు. రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిచి ఉండడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున హైవే పెట్రోల్ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని మిగతా వాహనాలకు ఏలాంటి ఆటంకాలు లేకుండా విజిబుల్ పోలీసింగ్ గా ఉండి విధులు నిర్వర్తించాలని పోలీసులకు తెలిపారు. వాహనాల వేగ నియంత్రణ కొరకు 80 కిలోమీటర్ స్పీడ్ దాటితే చలన్స్ విధించాలని, వాహనదారులకు కనిపించే విధంగా ఇంకా కొన్ని స్పీడ్ నియంత్రణ సూచికలు అవసరమైన చోట వేయించాలని అధికారులకు యస్.పి ఆదేశించారు. గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల కంటే ఈ సారి ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రజలకు,వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు తెలిపారు.యస్.పి తో పాటు సిఐ చంద్రశేఖర్, మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి ఏఈ ఆర్ అండ్ బి అభిషేక్ రెడ్డి, ప్రధాన రోడ్డు కాంట్రాక్టర్ మధువర్మ లు ఉన్నారు.

## కళల్లో మా నాన్న బతికున్నాడు

**- సుద్దాల హనుమంతు సంస్కృతిక ఉత్సవాల్లో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ భావోద్వేగం**




**పాలమూరు మేజర్ న్యూస్:** సామాజిక బాధ్యతతో ప్రజా కళాకారులు ప్రదర్శించే ఆటపాటల్లో, కళారూపాల్లో మా నాన్న సుద్దాల హనుమంతు ఇంకా బతికే ఉన్నాడని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ భావోద్వేగంతో అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవి దాసరికుడు సుద్దాల హనుమంతు స్ఫూర్తితో ఆరవ తరగతి నుండి పాటలు రాయడం అలవాటు చేసుకున్నానని, మానవత్వం ప్రాధాన్యతగా రెండు వేల సినిమాల్లో మూడు వేల పాటలు రాశానన్నారు. కవి, కళాకారులకు స్పందించే గుణం ఉంటుందన్నారు. డాక్టర్, ఇంజనీర్ ఉద్యోగాల కోసమే కాకుండా తమకు నచ్చిన అంశాల్లో రాణించాలని సూచించారు. తాను సినారే పక్కనే నా పేరుండాలని చిన్నప్పుడే అనుకున్నానని చెప్పారు. యువత ఉన్నతమైన ఆలోచనతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో విద్యార్థులు ప్రదర్శించిన సుద్దాల హనుమంతు జీవిత చరిత్రను తెలిపే నాటకాన్ని హైదరాబాదులో ప్రదర్శించేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా " నల్లాని రాళ్ళల్లో ఏ కన్నులు" నేను చచ్చిపోతున్నా రేపే దప్పయి పుడతా" ఎండ కో ర్చి వానకోర్చి " పల్లెటూరి పిల్లగాడ - పసుల గాసే మొనగాడా " కొమ్మ ఉయ్యాల కోన జంపాల" వంటి పలు సామాజిక, సినిమా పాటలు పాడి అలరింప చేశారు. అనంతరం కవి సమ్మేళనం, జానపద గేయాలు, ఏకపాత్రాభినయం, బతుకమ్మ, వెస్టర్న్ డాన్స్ వేదికల్లో కళాకారుల ప్రదర్శనను చూసి అభినందించారు. సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల వేదిక అధ్యక్షులు బెక్కం జనార్దన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిపిఎస్కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఉత్సవాల వేదిక అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీ కురుమూర్తి, జగపతిరావు,ప్రతినిధులు కురుమయ్య, ప్రమోద్ కుమార్, ప్రశాంత్, ప్రమోద్, బాలచంద్రుడు, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ ప్రతిభ భరత్, రాము, పద్మ,నందు,ఈశ్వర్ పాల్గొన్నారు.

## విజయవంతమైన నేత్ర వైద్య శిబిరం



**కోస్గి మేజర్ న్యూస్:** లయన్స్ క్లబ్ ఆఫ్ కోస్గి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైనట్లు నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్ తెలిపారు. గురువారం కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో మండల పరిధిలోని సుమారు 70 మంది కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 28 మందికి ఉచిత ఆపరేషన్ల కొరకు రాంరెడ్డి కంటి ఆసుపత్రికి మహబూబ్ నగర్ పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ పూర్ణచంద్రయాదవ్,లయన్స్ క్లబ్ మాజీ సభ్యులు వెన్న శేఖర్ పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణాల తనిఖీ



**కృష్ణ మేజర్న్యూస్:** మండలంలోని గుడేబల్లూర్ లో గల చౌక ధరల దుకాణాలను తహాశీల్దార్ బి.వెంకటేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు రేషన్ను సకాలంలో పంపిణీ చేయాలని, సక్రమంగా సరుకులు అందించాలని డీలర్లకు సూచించారు. నెల వారిగా ఎంత రైస్ స్టాక్ వస్తుంది ఎంత వెళ్తోంది, ఈ పాస్ మిషన్ పనితీరు డీలర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గదిలో భద్రపరిచిన బియ్యం బస్తాలను తహాశీల్దార్ పరిశీలించారు. షాపులో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారనే వివరాలతో పాటు, బియ్యం క్వాలిటీ ,ఇతర వివరాలను డీలర్లను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఆనంతరం రికార్డులు , రిజిస్టర్లను తహాశీల్దార్ పరిశీలించారు.

## గుడ్ల నర్వలో కల్తీకల్లు కలకలం

### - కల్లు సీసాలో ఎలుక పిల్ల- పట్టించుకోని అధికారులు

**బిజినపల్లి మేజర్ న్యూస్:** బిజినపల్లి మండలంలో కల్తీకల్లు ఏరులై పారుతుంది గత పది రోజుల క్రితం మండలంలోని గంగారం గ్రామంలో కల్లు సీసాలో పాముపిల్ల కలకలం మరవక ముందే గుడ్ల నర్వ గ్రామంలో కల్లు సీసాలో ఎలుక పిల్ల కలకలం సృష్టించింది అమాయక పేద ప్రజలు తీసుకునే కల్లులో ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు తాజాగా గుడ్ల నర్వ గ్రామంలో కల్లు దుకాణంలో ఒక ట్రే కల్లు తీసుకొని తమ ఇంటికి వెళ్లిన ఓ వ్యక్తి కల్లు రెండు గుటకలు మింగిన వెంబడే సీసాలో ఏదో కదిలినట్లు కనపడడంతో కల్లును కింద పోసి చూడడంతో ఎప్పుడో చనిపోయిన ఎలుక పిల్ల ప్రత్యక్షమవడంతో కంగుతిన్న వ్యక్తి చుట్టుపక్కల వారు వెంటనే కల్లు వ్యాపారిని నిలదీశారు సంఘటనపై ఎక్సైజ్ అధికారులను వివరణ కోరడంతో మాకు సమాచారం రాలేదని తెలిపారు ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కల్లు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు విజయవంతం

### - ఆకట్టుకున్న ప్రదర్శనలు, పాల్గొన్న యువతను అభినందించిన సుద్దాల అశోక్ తేజ









**పాలమూరు మేజర్న్యూస్:** సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవ వేదిక ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన యూత్ ఫెస్ట్ లో ఇంటర్,డిగ్రీ, పీజీ విద్యార్థులతోపాటు యువతి యువకులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు అందరినీ ఆలరింప చేశాయి. మొదటిరోజు జానపద నృత్యాలు,శాస్త్రీయ నృత్యం, లఘు నాటికలు, కోలాటం నిర్వహించగా, గురువారం బతుకమ్మ, వెస్ట్రన్ డాన్స్, జానపద పాటలు, ఏకపాత్రాబినయంలో యువతతో పాటు మహిళలు పాల్గొన్నారు. పల్లెప్రజల జీవన విధానాలపై పలు సినిమా పాటలపై విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భిన్నత్వంలో ఏకత్వం, జూనియర్స్కు స్త్రీ పురుష లింగ వివక్షత, సీనియర్స్ విభాగంలో భిన్నత్వంలో ఏకత్వం పోటీల్లో విద్యార్థులు, యువత అత్యధికంగా పాల్గొన్నారు. మార్క ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, సెల్ఫోన్, మూఢనమ్మకాల పై కవిత గానాలు చేశారు. సైడ్ డాన్స్ అకాడమీ తిరుపతి బృందం ప్రదర్శించిన దేశభక్తి గేయం నృత్యంలో సన్నివేశాలు కంటతడి పెట్టడంతోపాటు దేశభక్తిని తట్టి లేపాయి. పలు సినిమా పాటలకు అమ్మాయిలు వేసిన స్టెప్పులు ఉర్రూతలూగించాయి. ప్రముఖసినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ముఖ్యఅతిథిగా పాల్గొని యువతను అభినందించారు. రెండు రోజుల ప్రదర్శనలో ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన బృందాలు, విజేతలకు పార్టీస్పేట్ సర్టిఫికెట్లతోపాటు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టిపిఎస్కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల వేదిక అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు బెక్కం జనార్ధన్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వి కురుమూర్తి, డాక్టర్ ప్రతిభ, జగపతిరావు, ఉపాధ్యక్షులు కార్యదర్శులు ఎం కురుమయ్య ప్రమోద్ పద్మ గోపాల్, ప్రశాంత్ భరత్ నందు ఈశ్వర్ రాము రవీందర్ నాయక్ కురుమయ్య బాలచంద్రుడు, సలహాదారులు కొప్పూలు యాదయ్య, ఖాజా మైనుద్దీన్, ఎన్ వెంకటేష్, వెంకటస్వామి, అశోక్ గౌడ్, వర్మ, పి లక్ష్మీనారాయణ యాదయ్య,మాస్టర్లు చంద్రశేఖర్, అజీమ్, తిరుపతి, స్వాతి, పద్మ, పద్మావతి, కళాశాలల విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించాలి – డిఇఓ రమేష్




**నాగర్కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్న్యూస్:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయలో 9 మరియు 11 తరగతుల్లో ప్రవేశానికి గాను శనివారం నాడు నిర్వహించబోయే ఎంపిక పరీక్ష సెంటర్ సూపరింటెండెంట్ లు మరియు కేంద్ర పరిశీలకుల శిక్షణా కార్యక్రమం బుధవారం నాడు నాగర్కర్నూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రవేశపరీక్ష ఇన్ చార్జి వి.భాస్కరాచారి మాట్లాడుతూ 9,11 తరగతుల్లో ఖాళీసీట్ల కొరకు సిబిఎస్ఇ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నుండి హాజరయ్యే విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షను నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, వట్టెం నవోదయ పాఠశాలలలో మొత్తం 20 సెంటర్లల్లో నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష నిర్వహణ జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన %ణజూ% రమేష్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక నవోదయ ప్రవేశ పరీక్షను జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని, ఏ మాత్రం నిర్లక్షం, అలసత్వాన్ని సహించబోమన్నారు.ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5016 మంది విద్యార్థులు హాజరయ్యే ఈ పరీక్ష నిర్వహణలో భాగమయ్యే అధికారులంతా అత్యంత జాగ్రత్త వహిస్తూ అప్రమత్తంగా ఉండి, పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పవర్ పాయింట్ సమర్పణ ద్వారా పరీక్ష నిర్వహణ దశలను , జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు.ఇది వరకే దరఖాస్తు చేసుకున్నారు ఆన్ లైన్ లో హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. నవోదయ ప్రవేశ పరీక్షలను ప్రతి ఏటా ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా యంత్రాంగాన్ని, విద్యా శాఖను అభినందించారు. జిల్లా పరీక్షల అదనపు కమిషనర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశనివ్వకూడదని అన్నారు. అనంతరం వివిధ కేంద్రాల నాన్ కాన్ఫిడేన్సియల్ మెటీరియల్ ను అందించారు.

## 11న కందూరు రామలింగేశ్వర స్వామి జాతర కొబ్బరికాయల బహిరంగ వేలము

**అడ్డాకుల,మేజర్ న్యూస్:** అడ్డాకుల మండల పరిధిలోని కందూరులో వెలిసిన రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవములు, జాతర సందర్భంగా కొబ్బరికాయలు అమ్ముకొనుటకు, తలనీలాలు ప్రోగు చేసుకొనుటకు, లడ్డు ప్రసాదములు అమ్ముకొనుటకు, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునుటకు శివరాత్రి నుండి ఉగాది వరకు మాత్రమే ఒక సంవత్సరం హక్కు పొందుటకు ఈనెల 11న రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలము నిర్వహించబడునని కార్యనిర్వహణ అధికారి మరియు అకౌంటెంట్ అనంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

# కలెక్టర్ సారు పెద్దమందడి ప్రజలకు
# ఆధార్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంచండి

### - తరచుగా తాళం వేసుకొని ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం...




**పెద్దమందడి మేజర్న్యూస్:** పెద్దమందడి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆధార్ కార్డులలో నమోదు అయిన తప్పులను సరిచేసుకునేందుకు మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ కు వస్తున్నప్పటికి ఆధార్ సెంటర్ తాళం వేసుకొని ఉండటం వల్ల సకాలంలో ఆధార్ సేవలు తమకు ఉపయోగపడడం లేదని ప్రజలు అంటున్నారు.. గురువారం వీరాయపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కిషోర్ ఆధార్ లో గగనం కిషోర్ కు బదులు.. బుడగ కిషోర్ అని నమోదు అయింది.. ఆధార్ లో ఇంటిపేరును సరి చేసుకున్నందుకు సంబంధిత విద్యార్థి తండ్రితో కలిసి ఆధార్ సెంటర్ కు రావడంతో తాళం వేసుకొని ఉన్నది ఈ సందర్భంగా ఆ విద్యార్థి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఇక్కడికి వస్తున్నానని తాళం వేసుకొని ఉండటం వల్ల ఆధార్ లో తప్పును సరిచేసుకోలేకపోతున్నాను అని ఆధార్ లో తప్పుగా నమోదైన ఇంటి పేరుతో ప్రభుత్వ పథకాలు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవరోధాలు ఏర్పడుతున్నాయని విద్యార్థి కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు.. తాసిల్దార్ మరియు జిల్లా కలెక్టర్ స్పందించి ఆధార్ సేవలు మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్నగర్ జిల్లా :
హన్వాడ, కౌకుంట్ల, మూసాపేట, భూత్పూర్
గద్వాల జిల్లా :
గద్వాల ప్రతినిధి, రూరల్, టౌన్, ఉండవెల్లి, కేటిదొడ్డి, గట్టు, రాజోలి, ఇటిక్యాల, ఎర్రవల్లి, వడ్డేపల్లి, మానోపాడు, అయిజ
నారాయణపేట జిల్లా : ఊట్కూర్
వనపర్తి జిల్లా : వనపర్తి, రూరల్, పెబ్బేరు, పాన్గల్, ఖిల్లఘణపురం
నాగర్కర్నూల్ జిల్లా :
బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, తాడూరు, ఉప్పునుంతల, తిమ్మాజిపేట

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757